


***(దశాబ్దాల క్రిందటి తెలుగు వారి జీవన విధానాలకు అద్దం పట్టిన సరదా కబుర్ల సమాహారం)***

**66**

(11 ' సెప్టెంబరు 71, ఆంధ్రప్రభ దినపత్రికలో ప్రచురితం)

**కొందరు మాట్లాడడంలో** చాలా పొదుపుగ మాట్లాడుతూ వుంటారు. అలాంటివారు మాట్లాడుతున్నప్పుడు పలుకే బంగారమా అన్నట్లుంటుంది.

"ఎక్కువగా మాట్లాడడం వల్ల వచ్చే ప్రయోజనం ఏం వుంటుంది? మన భావం అవతలవాడికి అందించడమే కదా ముఖ్య ఉద్దేశ్యం. పైగా అవతలవారు ఒక చిన్న విషయాన్ని పెద్ద ఉపన్యాసంగా మార్చి చెప్పవలసిన స్థితిలో వుండరుగదా - అలా వున్నారనుకుని మనం మాట్లాడటం మనం చేసే అపచారమే అవుతుంది కదా!" అని ఒక వింతభాషి నిర్వచించాడు.

ఆయన భావాలతో ఏకీభవించకపోవడం కూడా అపచారమే అవుతుంది. మనకు మాటలమీద మక్కువ కొద్దీ ఎక్కువ మాట్లాడటమే కాని - భావాన్ని అందిస్తే మన పని అయిపోతుందన్నమాట సత్యమేగదా!

***సంజ్ఞలుచాలు సకలం గ్రహించడానికి***

ఎవరో అన్నట్లు అసలు మాట్లాడటం చాలా శ్రమతో కూడిన పని. సంజ్ఞలతో సకల భావాలూ వెలువరించవచ్చు. సంజ్ఞలు అద్భుతమైన సాంకేతికాలు. వాటిని ప్రదర్శించడం, అందుకోవడం కూడా చక్కటి కళే.

మూగవారు ఈ విధానానికి గురువులు. వారు పాపం మాట్లాడాలని తాపత్రయం కలవారైనా నోరు లేకపోవడం వల్ల - ఎన్నో సాంకేతికాలూ, సంజ్ఞలూ అలవాటు చేసుకోవలసి వస్తుంది. వారి స్థితిని చూస్తే జాలివేస్తుంది. నోరుండి పొదుపుగా వాడుకునేవారిని చూస్తే ఎంతో సంతోషం కలుగుతుంది.

"ఆయన మూడు ముక్కల మనిషి" అని కొందర్ని ప్రశంసిస్తూ వుంటారు. పై మాటకు చీట్లాటలో అభిలాష గలవాడనే అర్థం ఒకటి ఏర్పడింది గనుక కొంచెం మార్చి చెప్పడం అవసరమవుతోంది.

మితభాషులకు సంఘంలో ఎక్కువ గౌరవం వున్నదనే మాట సత్యం. ఇంకా కొంచెం మాట్లాడితే బాగుండుననిపిస్తుంది. అతిగ మాట్లాడేవారు చటుక్కున ఆపితే బాగుండును - మహోపకారం చేసినట్లవుతుందనిపిస్తుంది.

కొంచెం చనువుగలవారలా మాట్లాడుతున్నప్పుడు "అంత సొద దేనికి? అసలు విషయం చెప్పరాదూ" అని విసుక్కోవడం జరుగుతూ వుంటుంది. అవతలివారు తమ విసురులో ఇవతలవాళ్ళ విసుగు ఎంత మాత్రం గమనించరనేది కూడా మనం గమనించాలి.

అలా మాట్లాడేవారి విషయం అలావుంచి కొద్దిమాటలతో సరిపెట్టుకునే వారిలోగల చాకచక్యం కొంతవరకు పరిశీలిద్దాం.

***మీ యిష్టం.. మీకేం తోస్తే అది.. నాదేం వుంది?***

భర్త ఏదైనా విషయం తనంతట తాను తేల్చుకోలేక భార్యను సలహా అడుగుతాడనుకోండి. ఆవిడ ఒక్క ముక్కలో చెప్పేస్తుంది. "మీ యిష్టం" "మీకేం తోస్తే అది" "నాదేం వుంది" "అసలు నన్నడగాలేమిటి" - "ఇదేమి చిత్రం.. నాకేం తెలుసు" "మీదంతా సోద్యం - ఆ మాత్రం తెలియదేమిటి?" ఇత్యాదులు ఒక జాబితాలో చేరిన జవాబులు.

"ఇంకా నయం నన్నడగడమేమిటి?" "అంతదాన్నేమిటి నేను" - "అన్ని తెలివితేటలు నా దగ్గర ఎక్కడున్నాయి?"

"ఆ మాత్రం ఆలోచనే వుంటే ఇలా ఎందుకుంటాను?" - "మీకు పుణ్యం వుంటుంది. నామీద ఇలాంటివేమీ పెట్టకండి.. ఇలా బ్రతకనియ్యండి" - "ఇదో నాటకమేమిటి" "నా సలహా యిప్పుడు కావలసి వచ్చిందేమిటి ఎప్పుడూ లేనిది."

***భగవంతుడంత బుర్ర పెట్టలేదండీ***

"ఊరుకోండి ఎవరన్నా నవ్వుకుపోతారు"

"నన్ను పరీక్ష చేస్తున్నారేమిటి - నాతో సరసమేమిటి?" - "భగవంతుడు అంత బుర్ర పెట్టలేదండి" - ఇత్యాదులు కొంచెం ఉద్రేకంతో చెప్పే జవాబులక్రింద జమపడతాయి.

కొందరు పురుషులు ఇంటికి వచ్చి ఎంతో ఆప్యాయంగా "అది కాదే అసలేం జరిగిందంటే.." అని తన అనుభవాన్ని ఒకపావుగంటో, పది నిమిషాల్లో ఎంతో హృదయానికి హత్తుకునేట్లుగా భార్య సానుభూతికోసం తాపత్రయపడుతున్నట్లుగా చెప్పి ఆమె సమాధానం కోసం పుట్టెడు ఆశతో ఎదురు చూస్తారు.

ఆమెగారా విషయం అంతా శ్రద్ధగా వింటున్నట్లు అభినయించి అవతలనుంచి వచ్చే వాగ్ధాటి ఆగిపోయినదానికి గుర్తుగా "అలాగా అలా జరిగిందా!" అని ఒక్క ముక్క అని ఊరుకుంటారు. గుక్క తిప్పకుండా గుండెలో గాలిని అంత తోడిపోసిన వ్యక్తికి ఆ ఒక్క ముక్క ఏమంత సంతృప్తినిస్తుంది. మరో ముక్కను ఆమె పెదవులనుంచి ఎలాగైనా రప్పించాలనే కోరికతో "అలాగా అంటావేమిటి? అచ్చంగా అంతే జరిగింది. ఇంకా కొన్ని విషయాలు చెప్పాలా నీకు ఎందుకొచ్చిందని" అంటాడు. అప్పుడు కూడా ఆమె నోటినుంచి "బాగుంది" అనే పసిడి తునకలాటి ఒక్క ముక్క బయటపడుతుంది.

అవతల వ్యక్తి చెప్పే విషయాన్ని బట్టి ఆమె మాటలు పెరగవు గాని, అదే మోతాదులో కొంచెం మారుతూ వుంటాయి. "అసలెందుకలా వెళ్ళారు?" - "మరీ విచిత్రంగా వుందే" - "మనకేం పనిలేదేమిటి?" "ఇంకా నయం అంతటితో వదిలాడు" - "ఏమిటో గొడవ మనకన్నీ ఇలాటివే వస్తాయి" - "లేకపోతే మీదగ్గరా వాడి బడాయి" - ఇత్యాదులు సమయానుకూలంగా సందర్భ శుద్ధిగా వాడుతూ వుంటాయి.

***పోనీ అలా అనకపోయావు బాగుండేది.***

మా బంధువుల్లో ఒకాయన వున్నాడు. ఆయన అతి మితభాషి. ఆవిడ అన్నివేళల్లో అనర్గళంగా మాట్లాడుతూ వుంటుంది. తొణకదు - బెణకదు. మాట్లాడుతూ మధ్య మధ్య పెద్దగా నవ్వుతూ వుంటుంది. ఆయనగారు ఆలోచించి ఆలోచించి ఒకసారి చిరునవ్వు నవ్వి "పోనీ అలా అనకపోయావు" అంటాడు.

ఆమాట అందుకుని "అలా ఎలా అనమంటారండి. నేనేం వెర్రిదాన్నా అంటూ మరో గంభీర ఆవృత్తం."

కొంతసేపటికి మళ్ళీ ఆయనగారు తెగించి "ఎవరీమాట అన్నది? మిసెస్ చలపతా?" అంటాడు. "అయ్యో రామా! ఆవిడేనండి. అక్కడ వుండటానికి అందరూ వున్నారు. మిసెస్ సుబ్బరామయ్యా, మిసెస్ రామనాథం, మిసెస్ భానోజీరావు, మిసెస్ జంబులింగం, మిసెస్ ఆర్తనాథ, మిసెస్ డి.కె.యం.టి రావు అందరూ వున్నారు. అందరూ వూరుకున్నారు. మిసెస్ చలపతే అలా కల్పించుకుని మాట్లాడింది" అంటుందామె.

"ఆవిడది కొంచెం లూజు ఠంగ్" అని ఆయన మందహాసం చేస్తాడు. ఆవిడ గుణం తన భర్త అంత తేలిగ్గా కనిపెట్టినందుకావిడ ఎంతో మురిసిపోతుంది. పాపమాయన ఎందరి "టంగ్"ల విషయమన్నా ఎత్తుతాడుగాని, ఆవిడ "టంగ్" సంగతి మాత్రం పొరపాటునన్నా ఎత్తాడు. అంత ధైర్యంవుంటే ఎప్పుడో కత్తిరించి పారేసి వుండేవాడు.

***ఊరంతా వచ్చినా ఊకొట్టేవారు రాలేదు.***

కొందరు ప్రతిమాటకు ఊరికే "వూ"లు కొట్టి ఎంత సంభాషణన్నా తేలిగ్గా నడిపించగలరు... ఎదుటివారు. "ఊ" అంటుంటే చెప్పేవారి మనస్సు ఉయ్యాల్లా వూగిపోతూ వుంటుంది. ఆ ఉత్సాహం ఇక చెప్పక్కర్లేదు.

మా చిన్నతనంలో మా ఊర్లో రాత్రిపూట కొందరు తమాషా తమాషా కథలు చెపుతుండేవారు. గ్రామంలో స్త్రీ పురుషులు ఎందరో చేరేవారు. కథ రెండు మూడు గంటలు సాగేది. కథ చెప్పేవారు ముందుగా "ఊ" కొట్టేవారిని ఎన్నుకునేవారు. దాని మీద నుంచే కాబోలు "ఊరందరూ వచ్చినా వూ కొట్టేవాడు రాలేదు" అనే శాస్త్రం వచ్చింది.

Post your comments